క్లుప్తంగా

సింహగర్జనను జయప్రదం చేయండి



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న మాల మహానాడు నేతలు

హత్నూర(సంగారెడ్డి): మాలల ఆత్మగౌరవం కోసం డిసెంబర్ ఒకటో తేదీన నిర్వహించ తలపెట్టిన సింహగర్జనను జయప్రదం చేయాలని మాల ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు బక్కన్న పిలుపునిచ్చారు. మాలల సన్నాహక సమావేశాలలో భాగంగా శుక్రవారం హత్నూర మండలం దౌల్తాబాద్‌లో సింహగర్జన గోడ పత్రికను ఆవిష్కరించారు. ఎస్సీలలో ఒక వర్గానికి ప్రాధాన్యత కల్పిస్తూ మాలలను అణచివేతకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షులు పుండరీకం, జిల్లా కమిటీ సభ్యులు శ్రీనివాస్ మాల మహానాడు సీనియర్ నాయకులు శాంత కుమార్ కిష్టయ్య, మండల అధ్యక్షుడు పలంచ రాజీవ్ గాంధీ తదితరులు పాల్గొన్నారు.

నిలిచిన భగీరథ నీటి సరఫరా



వ్యవసాయ బావి వద్ద నీళ్లు పట్టుకుంటున్న బాబానగర్ ప్రజలు

జహీరాబాద్ టౌన్: మున్సిపల్ పరిధిలో గల బాబానగర్‌లో మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో కాలనీ ప్రజలు బిందెడు నీటి కోసం సమీపంలో గల వ్యవసాయ బావులను ఆశ్రయిస్తున్నారు. రంజోల్ పరిధిలో బాబానగర్‌కు మిషన్ భగీరథ పథకం ద్వారా నీటి సరఫరా జరుగుతుంది. అయితే పదిహేను రోజుల నుంచి నీటి సరఫరా ఆగిపోయింది. కాలనీ ప్రజలు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడంలేదు. కాలనీలో ఉన్న బోరు మోటారు కూడా చెడిపోయింది. దీంతో కాలనీ సమీపంలో గల ప్రైవేట్ వ్యక్తులకు సంబంధించిన వ్యవసాయ బావి వద్దకు వెళ్లి నీళ్లు పట్టుకొస్తున్నారు. అధికారులు స్పందించి నీటిని సరఫరాకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రైతు పండుగపై అవగాహన



సమావేశంలో పాల్గొన్న రైతులు

ఝరాసంగం(జహీరాబాద్): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే రైతు పండుగ వేడుకపై మండల రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. శుక్రవారం మండల కేంద్రమైన ఝరాసంగం సొసైటీ ఆవరణలో రైతు పండుగ వేడుకకు హాజరయ్యే రైతులతో సమావేశమయ్యారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ గౌసొద్దిన్, సీఈఓ నిసార్ అహ్మద్, రైతులు పాల్గొన్నారు.

బీసీ గురుకులం తనిఖీ



విద్యార్థులతో కలిసి భోజనాలు చేస్తున్న అధికారులు

నారాయణఖేడ్: ఖేడ్ మండలంలోని జూకల్ శివారులో ఉన్న మహాత్మా జ్యోతిబాపూలే బీసీ బాలుర గురుకులాన్ని శుక్రవారం మండల ప్రత్యేక అధికారి సర్దార్ సింగ్, ఎంఈఓ వెంకటేశంతో కలిసి అకస్మికంగా తనిఖీ చేశారు. వంటగది, స్టోర్ గది, తరగతి గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు వంటలకు వాడే సరుకులు, బియ్యం నాణ్యత వివరాలు అడిగి తెలుసుకున్నారు. మూత్రశాలలు, మరుగుదొడ్లు, పరిసరాల పరిశుభ్రత, గురుకులంలో నెలకొన్న సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ప్రిన్సిపాల్ శ్రీను, ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. భోజనం నాణ్యతను పరిశీలించాకే విద్యార్థులకు వడ్డించాలని అధికారులు సూచించారు.


డ్రంకెన్ డ్రైవ్‌లో జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమాన విధించింది. ట్రాఫిక్ సీఐ లాలూ నాయక్ కథనం మేరకు.. గురువారం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో ఎనిమిది మంది మద్యం తాగి వాహనాలు పట్టుబడ్డారు. వీరిని శుక్రవారం సంగారెడ్డి కోర్టులో హాజరు పర్చగా ఏడుగురికి ఒక్కొక్కరికి రూ.2 వేలు జరిమానా, ఒకరికి రూ.1,500 జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

యాసంగికీ ఎదురుచూపులే!

వానాకాలంలో సాగునీరివ్వని ప్రభుత్వం

- నార్లు పోయడానికి సిద్ధంగా రైతులు
- పదేళ్లుగా సింగూరు నీటితో సాగు
- డ్యామ్‌లో ప్రస్తుత నీటి నిల్వ 29.300 టీఎంసీలు
- సాగుకు రెండే టీఎంసీలు



వానాకాలంలో సింగూరు నుంచి సాగునీటి కోసం ఎదురుచూసి నిరాశపడిన రైతులకు యాసంగి పంటలకూ అదే పరిస్థితి ఎదురయ్యేలా కన్పిస్తోంది. దశాబ్దకాలంగా సింగూరు జలాలపై ఆధారపడి సాగు చేసిన రైతులు ఈ యాసంగి సీజన్‌కూ ప్రభుత్వం సాగు నీరు అందించకపోతే నీటిచుక్క కోసం దిక్కులుచూడాల్సిన పరిస్థితి మళ్లీ పునరావృతమవుతుందేమోనని రైతులు ఆందోళన పడుతున్నారు. ఇప్పటికే నార్లు పోసేందుకు సిద్ధంగా ఉన్న రైతులు తమపై రాష్ట్ర ప్రభుత్వం కరుణించకపోతుందా అని ఎదురుచూస్తున్నారు.

పుల్‌కల్(అందోల్): యాసంగి సీజన్‌లో సాగుకోసం సింగూరు జలాలను ఎప్పుడు విడుదల చేస్తారా అని రైతులు ఎదురుచూస్తున్నారు. వానాకాలంలో సాగునీటికోసం ఎదురు చూసిన అధికారులు చుక్క నీటిని విడుదల చేయలేదు. కాలువలకు సిమెంట్ లైనింగ్, డ్యామ్‌లో నీరు తక్కువగా ఉందని సాకులు చెబుతూ నీటిని విడుదల చేయలేదు. వానాకాలంలో సాగు నీరు విడుదల చేయకపోవడంతో బోరుబావుల ద్వారానే సేద్యం చేశారు. కాలువ నీళ్లు వస్తాయనే ఆశతో అధికంగా నార్లు పోసుకున్న రైతులు నీరు విడుదల చేయకపోవడంతో బోర్లు పారకం వరకే సాగు చేసుకున్నారు. వానాకాలంలో సాగునీరు రాకపోవడంతో ధాన్యం దిగుబడులు తగ్గాయని రైతులు వాపోయారు.

డ్యామ్‌లో నీటి నిల్వలు....

వానాకాలంలో డ్యామ్‌లో 14 టీఎంసీల నీరు నిల్వ ఉన్నా సిమెంట్ లైనింగ్ అని, తాగునీటికోసమని నీటిని విడుదల చేయలేదు. డ్యామ్‌లో 9 టీఎంసీల నీటినిల్వలున్న లిఫ్టుకు నీరు అందేవిధంగా సాగు లిఫ్టులను అమర్చారు. జూలైలో 14 టీఎంసీల నీరు ఉంది. లిఫ్టుకు అదనంగా ఐదు టీఎంసీల నీరు ఉంది. వానాకాలం సాగునీటికి 1.5 టీఎంసీల నీరు విడుదల చేస్తే పంటలు పండేవని రైతు నాయకులు వాపోయారు. ఆ తర్వాత జూలై ఆఖరి వారం నుంచి భారీ వర్షాలు కురవడంతో డ్యామ్ పూర్తిస్థాయి నీటి మట్టానికి చేరుకుంది. భారీ వరదలు రావడంతో దిగువకు నీటిని వృథాగా వదిలారు తప్ప సాగు నీరు మాత్రం విడుదల చేయలేదు. రైతులు తమ భూములను వరి పండటానికి వీలుగా చదును చేసుకున్నారు. దీంతో ఆ భూముల్లో వరి తప్ప వేరే పంటలు వేయలేమని రైతులు తెలిపారు. ఒకవేళ ఆరుతడి పంటలు వేసినా మడుల్లో నీరు నిల్వచేరి పంటలు చేతికిరావని ఆందోళన చెందుతున్నారు.

పూర్తి స్థాయిలో నీటి నిల్వలు

ప్రస్తుతం సింగూరు డ్యామ్‌లో 29.300 టీఎంసీల నీటి నిల్వలున్నాయి. సింగూరు సాగునీరు విడుదల చేస్తే పుల్‌కల్, చౌటకూర్, అందోల్ మండలాల్లో 40 వేల ఎకరాలు, 114 చెరువుల ద్వారా పదివేల ఎకరాల వరకు సాగు చేస్తారు. ఈసారైనా యాసంగికి సాగు నీరు విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు. యాసంగిలో తొందరగా నాట్లు వేస్తేనే వేసవిలో వడగళ్ల వానలు రాకముందే పంటలు పూర్తి కావాలని రైతులు యోచిస్తున్నారు. ఇదిలా ఉండగా సింగూరు సాగునీరు విడుదలపై జిల్లా మంత్రి దామోదర రాజనర్సింహతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని నీటి పారుదల శాఖ అధికారులు చెబుతున్నారు.

డ్యామ్‌లో నీరున్నా సాగునీరు ఇవ్వలే



వానాకాలంలో డ్యామ్‌లో నీరున్నా సాగునీరు ఇవ్వలేదు. దశాబ్దం నుంచి సాగునీటితో రైతులు వరినాట్లు వేశారు. ఒక్కసారిగా నీటిని విడుదల చేయకపోవడంతో రైతులు తీవ్రఇబ్బందులు ఎదుర్కొన్నారు.

– కనకారెడ్డి,రైతు పోచారం

ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌ను సస్పెండ్ చేయాలి

డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి అనిల్



ఖాళీ కుర్చీకి వినతి పత్రం ఇస్తున్న నాయకులు

సంగారెడ్డి రూరల్: జిల్లా కేంద్రంలోని ఫుడ్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో శుక్రవారం అధికారి అందుబాటులో లేకపోవడంతో డీవైఎఫ్ఐ నాయకులు ఖాళీ కుర్చీకి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంఘం కార్యదర్శి అనిల్ మాట్లాడుతూ.. జిల్లాలో తరచూ ప్రజలు, విద్యార్థులు ఫుడ్ పాయిజన్‌తో రోగాల పాలవుతుంటే సంబంధిత జిల్లా అధికారులు మాత్రం ఎక్కడా తనిఖీలు చేయడం లేదని, కార్యాలయాలకు రాకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. దీంతో ప్రభుత్వ వసతి గృహాల్లో, హోటల్, రెస్టారెంట్లో కల్తీ ఆహార పదార్థాలను వండి పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. వెంటనే ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌పై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా నాయకులు సాయి, శివ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా..?

పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ధర్నా



ఆర్డీఓకు వినతి పత్రం అందజేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

సంగారెడ్డిఎడ్యుకేషన్: ఫుడ్ పాయిజన్‌తో విద్యార్థుల ప్రాణాలు పోతున్నప్పటికీ ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోక పోవడం బాధాకరమని పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు సందీప్ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం సంగారెడ్డిలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా సంక్షేమ గురుకుల హాస్టళ్లలో నాణ్యమైన భోజనం అందక విద్యార్థులు ప్రాణాలు కోల్పోతున్నారని వాపోయారు. రోజురోజుకు హాస్టళ్లలో మరణాల రేటు పెరుగుతున్నా పట్టించుకోని అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో బంద్‌కు పిలుపును ప్రకటిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు బన్నీ ,సిద్దేశ్వర్, శ్రీకాంత్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రియాంకకు షెట్కార్ శుభాకాంక్షలు



పుష్పగుచ్ఛం అందిస్తున్న సురేష్ షెట్కార్

నారాయణఖేడ్: ఎంపీగా గెలిచిన ప్రియాంకగాంధీని శుక్రవారం ఢిల్లీలోని ఆమె నివాసంలో జహీరాబాదు ఎంపీ సురేష్ షెట్కార్ కలిసి సన్మానించారు. పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

కనులపండువగా రథోత్సవం

మునిపల్లి(అందోల్): కనుల పండువగా జీవన్ముక్త సంస్థాన రథోత్సవ కార్యక్రమం జరిగింది. శుక్రవారం మండలంలోని అంతారం జీవన్ముక్త సంస్థానంలో నాల్గవ రోజు రథోత్సవం నిర్వహించారు. జీవన్ముక్త సంస్థాన పీఠాధిపతి జ్ఞానేశ్వర్ మహారాజ్ పూజా కార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం రథాన్ని గ్రామ పురవీధుల గుండా ఊరేగించారు. భక్తు లు దేవతామూర్తులను దర్శించుకొని తరలించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్, బీఆర్ఎస్ నాయకులు సాయికుమార్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

గణితం జీవితంలో ఒక భాగం

మండల విద్యాధికారి దశరథ్

కొండాపూర్(సంగారెడ్డి): మండల కేంద్రమైన కొండాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జిల్లా గణిత ఫోరం ఆధ్వర్యంలో మండల స్థాయి మ్యాథమెటిక్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ పోటీలను మండల విద్యాధికారి దశరథ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణితం జీవితంలో ఒక భాగమైందన్నారు. ప్రతి విద్యార్థికి ఇంజనీర్ కావాలనే కల ఉంటుందని తెలిపారు. గణితం చదవడం ద్వారా రాదని, ఎన్నిసార్లు అభ్యాసనం చేస్తే అంత తొందరగా వస్తుందని చెప్పారు. మండల స్థాయిలో విజేతలుగా నిలిచిన విద్యార్థులు జిల్లా స్థాయిలో కూడా రాణించాలన్నారు. ఇంగ్లిష్ మీడియంలో జెడ్పీహెచ్ఎస్ కొండాపూర్ విద్యార్థి ఈశ్వర్ ప్రథమ స్థానం, జెడ్పీహెచ్ఎస్ మల్లెపల్లి విద్యార్థి నందిని ద్వితీయ, జెడ్పీహెచ్ఎస్ గంగారం విద్యార్థి బాల్‌రాజ్ తృతీయ స్థానంలో నిలిచారు. అదే విధంగా తెలుగు మీడియంలో జెడ్పీహెచ్ఎస్ అనంతసాగర్ విద్యార్థి దీపిక ప్రథమ స్థానం, జెడ్పీహెచ్ఎస్ మారేపల్లి విద్యార్థి స్వాతి ద్వితీయ, జెడ్పీజీహెచ్ఎస్ అనంతసాగర్ విద్యార్థి సుర్షిత తృతీయ స్థానంలో నిలిచారు. ఈ కార్యక్రమంలో జిల్లా గణిత ఫోరం వర్కింగ్ ప్రెసిడెంట్ రాగ్యా నాయక్, మండల బాధ్యులు బాల్‌రాజ్, మల్లయ్య, నర్సింలు, నవీన్, కృష్ణమూర్తి, రాఘవేందర్, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



దేవతామూర్తులను దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్

మునిపల్లి(అందోల్): పాండు రంగ విఠలేశ్వర, రుక్మాబాయి దేవతామూర్తులకు అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ పూజలు నిర్వహించారు. శుక్రవారం జీవన్ముక్త ఉత్సవాలలో భాగంగా దేవతామూర్తులకు దర్శించుకున్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ మీనాక్షి సాయికుమార్, డాకూర్ జైపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సాయికుమార్, జిల్లా నాయకులు శివశంకర్, మండల ప్రధాన కార్యదర్శి శశికుమార్, అంతారం మాజీ సర్పంచ్‌తో పాటు నాయకులు పాల్గొన్నారు.

మగ్గంవర్క్‌లో మహిళలకు ఉచిత శిక్షణ

సంగారెడ్డి రూరల్: స్వయం ఉపాధి కల్పనలో భాగంగా వచ్చే నెల 6నుంచి మహిళలకు మగ్గం వర్క్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు స్టేట్ బ్యాంకు గ్రామీణ స్వయంఉపాధికల్పన, శిక్షణ కేంద్రం డైరెక్టర్ వంగా రాజేంద్ర ప్రసాద్ శుక్రవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. సంగారెడ్డి, మెదక్ జిల్లాలోని 18 నుంచి 45 ఏళ్లలోపు మహిళలు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు రేషన్ కార్డు, నాలుగు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు బైపాస్‌లోని స్టేట్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి కల్పనా శిక్షణ కేంద్రంలో ఇవ్వాలన్నారు. శిక్షణ కాలంలో భోజన, వసతి సదుపాయం ఉంటుందని, శిక్షణ పూర్తయిన తర్వాత మగ్గం వర్క్ కిట్ అందజేస్తామని తెలిపారు.

దీక్షా దివస్‌కు తరలివెళ్లిన బీఆర్ఎస్ శ్రేణులు



దీక్షా దివస్‌లో పాల్గొనేందుకు బయలుదేరుతున్న బీఆర్ఎస్ శ్రేణులు

నారాయణఖేడ్: బీఆర్ఎస్ ఆధ్వర్యంలో కందిలోని జిల్లా బీఆర్ఎస్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన దీక్షా దివస్ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఖేడ్ నుంచి బీఆర్ఎస్ శ్రేణులు తరలివెళ్లారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి ఖేడ్‌లోని బీఆర్ఎస్ కార్యాలయానికి వచ్చి ఇక్కడి నుంచి పలు వాహనాల్లో కందికి బయలుదేరి వెళ్లారు. బీఆర్ఎస్, కేసీఆర్‌కు అనుకూలంగా నినాదాలు ఇచ్చారు.

వైభవంగా సత్యనారాయణ స్వామి వ్రతాలు



శివాలయంలో సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహిస్తున్న దంపతులు

సంగారెడ్డి టౌన్: సంగారెడ్డి పట్టణం పోతిరెడ్డిపల్లి చౌరస్తాలోని శ్రీ కేతకి సంగమేశ్వర స్వామి దేవాలయంలో శుక్రవారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రత కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. కార్తీక మాస శివరాత్రి సందర్భంగా సత్యనారాయణ స్వామి వ్రత కార్యక్రమాలను నిర్వహించినట్లు దేవాలయ అర్చకులు తెలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని జరిపించారు.

ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోండి



చౌరస్తాను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పుష్ప

రామచంద్రాపురం(పటాన్‌చెరు): జాతీయ రహదారిపై జరుగుతున్న ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ పుష్ప కోరారు. శుక్రవారం పట్టణంలోని రైల్వేట్రాక్ చౌరస్తాను ట్రాఫిక్ సీఐ పవన్, జాతీయ రహదారుల డీఈ రామకృష్ణతో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైల్వేట్రాక్ సమీపంలోని యూటర్న్ వద్ద నిత్యం ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుందని తెలిపారు. దీంతో ఉదయం, సాయంత్రం వేళలో విద్యార్థులు, ఉద్యోగస్తులు అనేక ఇబ్బందులు పడుతున్నారని వివరించారు.

సంక్షిప్త వార్తలు

◆ సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

పుల్‌కల్(అందోల్): మండల పరిధిలోని గొంగ్లూర్ గ్రామంలో అనారోగ్యానికి గురై చికిత్స పొందిన గంపల అంజయ్యకు శుక్రవారం సీఎం రిలీఫ్‌ఫండ్ కింద నిధులు మంజూరయ్యాయి. ఈ మేరకు డీసీసీబీ మాజీ డైరెక్టర్ రాంచంద్రారెడ్డి, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, నాయకులు చాకలి నర్సింహులు, శ్రీకాంత్ గౌడ్, గోపాల్ రెడ్డి చెక్కును అందజేశారు.

◆ లక్ష్మయ్యను కలిసిన టీపీటీఎఫ్ నేతలు

జహీరాబాద్ టౌన్: తెలంగాణ ప్రోగ్రెసీవ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన మర్పల్లి లక్ష్మయ్యను జహీరాబాద్ జోన్ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనను కలిసిన వారిలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాంచందర్ భీంవంశీ, నాయకులు బుచ్చయ్య, రాంతీర్థం నర్సింహులు, శ్రీనివాస్, ఇర్షాద్, రాజు, మొగులయ్యలు ఉన్నారు.

◆ అభివృద్ధి పనులకు నేడు శంకుస్థాపన

ఝరాసంగం(జహీరాబాద్): మండలంలో శనివారం ప్యారవరం బ్రిడ్జి నిర్మాణం పనులకు శంకుస్థాపన, ఝరాసంగంలో మహిళా శక్తి క్యాంటీన్ ప్రారంభోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హన్మంత్ రావు పాటిల్ తెలిపారు. ఎంపీ సురేష్ కుమార్ షెట్కార్, సెట్విన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, మాజీ మంత్రి చంద్రశేఖర్, సీనియర్ నాయకుడు ఉజ్వల్‌రెడ్డి హాజరు అవుతున్నట్లు వెల్లడించారు.

◆ వెంచర్ యాజమాన్యంపై చర్యలు

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): సొటవాగు దారి మళ్లింపునకు అడ్డుకోవాలని కోరుతూ శుక్రవారం మండల పరిధిలోని వెల్టూర్ గ్రామానికి చెందిన రైతులు తహసీల్దార్ సరస్వతి, ఇరిగేషన్ అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. వెల్టూర్ గ్రామ శివారులో సర్వే నంబర్ 421, 425, 426, 427, 435, 436లలో భూముల మీదుగా ఎన్నో ఏళ్లుగా ప్రవహిస్తున్న సొటవాగును ఆయా వెంచర్ యాజమాన్యం దారి మళ్లిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో భవిష్యత్‌లో రైతులు పంటలు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ నవీన్, రైతులు రాజు, మల్లేశం, వెంకటేశం, బాలయ్య, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

◆ పత్తి రైతులను ఇబ్బందులు పెట్టొద్దు

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): భారీ వర్షాలతో తీవ్రంగా నష్టపోయి మానసిక వేదనతో బాధపడుతున్న రైతులను సీసీఐ అధికారులు ఇబ్బందులకు గురి చేయొద్దని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు నర్సింహా రెడ్డి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రాజశేఖర్ రెడ్డి, మల్లన్న, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

◆ ఆర్టీసీ కార్మికుల వనభోజనాలు

నారాయణఖేడ్: కార్తీకమాసాన్ని పురస్కరించుకొని ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఆదేశాలతో శుక్రవారం ఖేడ్ ఆర్టీసీ డిపోలో వనభోజనాల కార్యక్రమాన్ని నిర్వహించారు. డిపో ఉద్యోగులు, కార్మికులు, వారి కుటుంబీకులు హాజరుకాగా, డీఎం మల్లేశయ్య వారికి స్వయంగా భోజనాలను వడ్డించారు. అనంతరం ఉద్యోగులు, కార్మికులతో పాటు వారి కుటుంబీకులు ఉత్సాహంగా పాల్గొని ఆటలు ఆడారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజరు నర్సింహులు, పీఆర్వో పాండు, ఇతర అధికారులు ప్రవీణ్ కుమార్, హనుమయ్య, శివశంకర్, రాధాకృష్ణ, సత్యనారాయణ, భాస్కర్ పాల్గొన్నారు.

◆ బీజేపీ నేతల ముందస్తు అరెస్టు

కల్హేర్(నారాయణఖేడ్): మండలంలోని బీజేపీ నేతలను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. హైదరాబాద్‌లో ముట్టడి కార్యక్రమనికి వెళ్తున్న బీజేపీ నేతలను అదుపులోకి తీసుకొని కల్హేర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో మాజీ సర్పంచ్ బేతయ్య, నాయకులు రాజు, పండరి, కిష్టయ్య, విఠల్, చంద్రయ్య ఉన్నారు.

జిన్నారం (పటాన్‌చెరు): గురుకుల పాఠశాల విద్యార్థులకు కలుగుతున్న ఇబ్బందులపై బీజేపీ నాయకులు, కార్యకర్తలు మహాధర్నా కార్యక్రమానికి వెళ్తుండగా పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. శుక్రవారం జిన్నారం మండల బీజేపీ అధ్యక్షుడు కొత్తకాపు జగన్‌రెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాద్ మహాధర్నాకు తరలివెళ్తున్న నేపథ్యంలో పోలీసులు ముందస్తుగా నాయకులను కార్యకర్తలను అరెస్టు చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే బొల్లారం మున్సిపాలిటీ, గుమ్మడిదల మండలానికి చెందిన బీజేపీ నాయకులను అరెస్ట్ చేశారు.

◆ విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ

కల్హేర్(నారాయణఖేడ్): మండల కేంద్రం కల్హేర్‌లోని ఎస్సీ బాలుర హాస్టల్‌లో శుక్రవారం విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేశారు. వార్డెన్ కిషన్ మాట్లాడుతూ.. విద్యార్థుల సంక్షేమం కోసం ప్రభుత్వం అన్ని వసతులు కలిపిస్తుందని తెలిపారు.

◆ గణిత ఫోరం ఆధ్వర్యంలో టాలెంట్ టెస్టు

నారాయణఖేడ్: గణితంలో రాణించిన వారు అన్ని విషయాల్లో రాణిస్తారని ఎంఈఓ రాములు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో గణితఫోరం ఆధ్వర్యంలో టాలెంట్ టెస్టు పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీవిద్య, విజయ్‌కుమార్, మేరిహెలిన, శ్రీనివాసరావు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించండి

కల్హేర్(నారాయణఖేడ్): సమస్యలు పరిష్కరించాలని సిర్గాపూర్ ఎమ్మార్సీ కార్యాలయం ఎదుట శుక్రవారం సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగులు సమ్మె చేశారు. నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిబ్బంది శివకుమార్, ప్రకాశ్, స్వామి, క్రాంతి, వెంకట్‌రావు, రవీందర్‌రావు, స్వప్న, శోభ పాల్గొన్నారు.

◆ రైతన్నలకు సహకారం అందిస్తాం

కల్హేర్(నారాయణఖేడ్): పీఏసీఎస్ తరఫున రైతన్నలకు అన్ని విధాలుగా సహకారం అందిస్తామని డీసీసీబీ డైరెక్టర్, బోక్కసగాం పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రాం తెలిపారు. శుక్రవారం సిర్గాపూర్ మండలం బోక్కసగాం పీఏసీఎస్‌లో రైతుల పండుగ నిర్వహించారు. అనంతరం పాలకవర్గం సమావేశం నిర్వహించారు. గుండు వెంకట్‌రాంలు మాట్లాడుతూ.. సొసైటీ పరిధిలోని 605 మంది రైతులకు రూ. 3.90 కోట్లు రుణమాఫీ జరిగిందన్నారు. ఎంపీ సురేష్‌షెట్కార్, ఎమ్మెల్యే సంజీవరెడ్డి సహకారంతో రైతుల అభివృద్ధికి చర్యలు తీసుకున్నామని తెలిపారు. పీఏసీఎస్ తరపున రైతులకు ఎరువులు, విత్తనాలు అందజేశామని తెలిపారు. రికార్డు స్థాయిలో వరి ధాన్యం కొనుగోలు చేశామన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్లు జ్ఞాన్‌పటేల్, సీఈఓ సతీష్ పాటిల్, సిబ్బంది అజయ్ పాల్గొన్నారు.

◆ విరాళాల సేకరణ

రామచంద్రాపురం(పటాన్‌చెరు): సీపీఎం రాష్ట్ర మహాసభల సందర్భంగా శుక్రవారం సాయంత్రం పట్టణంలో సీపీఎం ఆధ్వర్యంలో విరాళాల సేకరణ చేపట్టారు. ఈసందర్భంగా సీపీఎం సీనియర్ నాయకులు పాండురంగారెడ్డి, నరసింహారెడ్డి మాట్లాడుతూ.. ప్రజాసమస్యలపై సీపీఎం నిరంతరం ఉద్యమిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మని రాజు, మల్లయ్య, మల్లేష్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

◆ ఆలయాలకు సంపూర్ణ సహకారం

జిన్నారం(పటాన్‌చెరు): ఆలయాలకు తన సంపూర్ణ సహకారాన్ని అందిస్తానని బీఆర్ఎస్ రాష్ట్ర నాయ కుడు, సీజీఆర్ ట్రస్ట్ చైర్మన్ గోవర్ధన్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని నల్తూరు గ్రామంలోని శివాలయంలో బీఆర్ఎస్ నాయకులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో నిర్వహించనున్న నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠాపనకు రూ. 30 వేల విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర యువత నాయకులు వెంకటేశంగౌడ్ మండల పార్టీ అధ్యక్షుడు రాజేష్, నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

◆ బాపూజీ విగ్రహానికి స్థలం కేటాయించండి

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్రను పోషించిన ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహాన్ని సదాశివపేటలో ఏర్పాటు చేసేందుకు స్థలాన్ని కేటాయించాలని కోరుతూ పట్టణ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో టీజీఐఐసీ చైర్మన్ నిర్మలారెడ్డికి శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఇందుకు ఆమె సానుకూలంగా స్పందించారని ఆ సంఘం నాయకులు తెలిపారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు విశ్వనాథం, నాయకులు నక్క ప్రభాకర్, ప్రేమ్‌కుమార్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

◆ 2న వాహనాల వేలం

జహీరాబాద్ టౌన్: ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వివిధ కేసులలో పట్టుబడిన పలు వాహనాలను వచ్చే నెల 2న వేలం వేస్తున్నట్లు ఎస్ఐ రమేశ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్‌డీపీఎస్ కేసులకు సంబంధించి జప్తు చేసిన, వాహనాలను వేలం వేస్తున్నట్లు చెప్పారు. పట్టణంలోని ఎక్సైజ్ స్టేషన్‌లో మధ్యాహ్నం వేలం పాట ఉంటుందన్నారు.

◆ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలి ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. శుక్రవారం భారతీ నగర్ డివిజన్ పరిధిలోని ఎల్ఐజీ కాలనీలో వేద పండితులు వామనభట్ల ప్రకాష్ శర్మ ఆధ్వర్యంలో చేపట్టిన కార్తీక మహోత్సవ వేడుకలను ప్రారంభించారు. కార్తీకమాసంలో మూడు రోజులపాటు ప్రత్యేక పూజా కార్యక్రమంలో నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు.

◆ మహిళల రక్షణకే షీటీంలు

పటాన్‌చెరుటౌన్: మహిళలు, విద్యార్థుల రక్షణ కోసమే షీటీంలు ఉన్నాయని సీఐ వినాయక్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని ఇస్నాపూర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు షీటీం, పోక్సో చట్టం, మాదకద్రవ్యాలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ.. విద్యార్థులు అత్యవసరమైతే డయల్ 100కు కాల్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఇస్నాపూర్ మాజీ ఎంపీటీసీ గడ్డం శ్రీశైలం, మాజీ సర్పంచ్ బాలమణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.